క్లుప్తంగా

కాంగ్రెస్ పథకాలు దేశానికే ఆదర్శం..



కొమ్మేపల్లి కాలనీలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. పట్టణంలోని కొమ్మేపల్లి కాలనీలో శుక్రవారం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకొని పరిశీలించారు. కాలనీలో తాగునీరు, డ్రెయినేజీ తదితర సమస్యలను పరిష్కరించాలని సింగరేణి పీఓ ప్రహ్లాద్‌ను ఆదేశించారు. అనంతరం కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, దోమ ఆనంద్, ఉడతనేని అప్పారావు, చెన్నారావు, సామేలు, కమల్‌పాషా, కృష్ణయ్య, రాంబాబు, రవి పాల్గొన్నారు.

కిష్టారంలో వైద్యశిబిరం

సత్తుపల్లిరూరల్: సింగరేణి ప్రభావిత గ్రామమైన సత్తుపల్లి మండలం కిష్టారంలోని అంబేడ్కర్‌నగర్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి వైద్యురాలు శిరీష, పీఓ నర్సింహారావు, పంచాయతీ కార్యదర్శి రమణ, వెల్ఫేర్ అధికారి విజయసందీప్ పాల్గొన్నారు.

సిస్టర్ ఆల్ఫేకు సన్మానం



సిస్టర్ ఆల్ఫేను సన్మానిస్తున్న విచారణ గురువులు

కల్లూరురూరల్: ఏసుక్రీస్తు దివ్య కారుణ్య దేవాలయంలో సిస్టర్‌గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా శుక్రవారం సిస్టర్ ఆల్ఫేను ఘనంగా సన్మానించారు. ఆమె కల్లూరు మండలం పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన కవిత తమ క్రీస్తు దివ్యకారుణ్య దేవాలయంలో సిస్టర్‌గా మారినందున గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా పెద్దకోరుకొండి ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు జ్యోజిబాబు ఆధ్వర్యంలో వివిధ మండలాలకు చెందిన విచారణ గురువులు, సిస్టర్లు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కల్లూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అజయ్‌కుమార్, పోచవరం సొసైటీ చైర్మన్ పెద్ద అంజయ్య, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు శేషగిరిరావు, అంజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెత్త తొలగించారు..



వల్లబిలో చెక్‌పోస్టు ఎదురుగా ఉన్న చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ముదిగొండ: మండలంలోని వల్లబిలో చెక్ పోస్టు, వైన్ షాపుల వద్ద ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారని, 'సాక్షి'లో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీంతో పంచాయతీ అధికారులు.. సిబ్బంది చెత్తను తొలగించారు. చెత్త వేస్తే షాపుల యజమానులకు నోటీస్‌లు ఇవ్వడంతో పాటు.. చెత్తవేసిన వారికి జరిమానా విధించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మురళి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

బోనకల్: మండలంలోని కలకోట, సిరిపురం బ్రిడ్జి వద్ద ఆటోను లారీని ఢీకొట్టిన ఘటనలో ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మధిర మండలం ఆత్కూరుకు చెందిన ఆటోడ్రైవర్ అరుణ్ శుక్రవారం కలకోట నుండి ఆత్కూరు వెళ్తున్నాడు. అదే సమయంలో మధిర వైపు నుండి వైరా వెళ్తున్న లారీ ఢీకొనగా ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నివాళి..

తల్లాడ: తెలంగాణ తొలి ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాత పినపాక గ్రామానికి చెందిన మోదుగు ఆశీర్వాదం భౌతిక కాయాన్ని శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీ కృష్ణారావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పుసుపులేటి నాసరయ్య సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సత్యనారాయణ, శ్యామ్‌కుమార్, శ్రావణ్, గోపయ్య గౌడ్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

పెట్రోల్.. నో రూల్ !

ఇష్టానుసారంగా బంకుల నిర్వహణ

- కొరవడిన ఉచిత వసతులు
- నిబంధనలకు తూట్లు
- అధికారుల పర్యవేక్షణ కరువు



కమలాపురంలో ఓ పెట్రోల్ బంకు వద్ద పేరుకే ఉన్న గాలి నింపే మిషన్

ముదిగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలు మోతమోగిస్తుంటే, మరోపక్క ప్రతీ లీటర్‌పై వ్యాట్ రూపంలో చెల్లించే రుసుంతో బంకుల్లో వినియోగదారులకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి చాలా మందికి తెలియదు. బంకుల వద్ద వినియోగదారులకు కచ్చితమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. అప్పుడప్పుడు కొంతమంది నిబంధనల పేరుతో ప్రశ్నిస్తే నిర్వాహకులు, సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం పరిపాటిగా మారింది. దీంతో ఈ సదుపాయాలు ఏ పెట్రోల్ బంకుల్లోనైనా అందించకపోతే మీరే స్వయంగా ఫిర్యాదు చేయొచ్చు.

ఉచిత సదుపాయాలు కరువు..

బంకుల వద్ద స్వచ్ఛమైన తాగునీరు వసతి ఉండాలి. ఇందు కోసం బంకు డీలర్ ఆర్వో యంత్రం, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాల్సి ఉంది. ఏ బంకులో కూడా తాగునీటి వసతి సౌకర్యం లేకపోతే ఆయిల్ కార్పొరేషన్‌కి ఫిర్యాదు చేయొచ్చు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పలు పెట్రోల్ బంకుల్లో ఏర్పాటు చేసినా వినియోగించేందుకు నిర్వాహకులు అనుమతులివ్వడం లేదు. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేనట్లయితే, పెట్రోలియం సస్థలకు ఫిర్యాదు చేయొచ్చు.

ఉండాల్సిన వసతులు..

బంకుల్లో లీటరు పెట్రోలు, లేదా డీజిల్ కొనుగోలు చేస్తే 10పైసలు వరకు మరుగుదొడ్లకు, మూత్రశాలలకు నిర్వాహకులకు చెల్లిస్తున్నాం. ఆపద సమయంలో అత్యవసర పరిస్థిల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యలో చిక్కుకుంటే మీ వెంట మీ మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోల్ బంక్‌ను సందర్శించినప్పుడు, మీరు ఏ నంబర్‌కైనా కాల్ చేయొచ్చు. వాహనాలల్లోని టైర్లల్లో గాలి నింపడానికి అనువుగా బంకుల్లో యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. ఇటీవల కాలంలో టైర్లల్లో గాలి నింపడానికి ఒక్కో టైరుకు బయట షాపుల్లో రూ.10లు తీసుకుంటున్నారు. బంకుల్లో గాలి నింపడానికి ఒక వ్యక్తిని అందుబాటులో ఉంచాలి. బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారులు కోరితే టైర్లల్లో గాలి తనిఖీ చేయాలి. ఎక్కువ శాతం ట్యూబ్‌లెస్ టైర్లు రావడంతో ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు.

కనిపించని ఫిర్యాదుల పెట్టె, ప్రథమ చికిత్స కిట్టు..

ప్రతీ బంకులో ఫిర్యాదు పెట్టె, లేదా రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారుడు తమ ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రథమ చికిత్స కిట్టు ప్రతి బంకులో ఉండాలి. దీంతో పాటు గడువుతో అన్ని మందులు ఉండాలి. పాత మందులు ఉండకూడదు. పెట్రోల్, డీజిల్ నాణ్యత ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. ప్రతి ఒక్కరు ఇవన్నీ తెలుసుకోవచ్చు. ఇవన్నీ తెలుసుకోవడానికి పరికరాలు సిద్ధంగా ఉంచాలి. వాటి ద్వారా నాణ్యతను పరీక్షించేందుకు మనకు హక్కు ఉంటుంది. పెట్రోల్, డీజిల్ తక్కువ వస్తే ఆ పరీక్ష కిట్ల ద్వారా తెలుసుకోవచ్చు.

మండలంలో వివరాలిలా..

ముదిగొండ మండలంలో వల్లబిలో రెండు, బాణాపురంలో రెండు, కమలాపురంలో ఒకటి, వనంవారికిష్టాపురంలో రెండు, ముదిగొండలో రెండు వివిధ రకాల కంపెనీల పెట్రోల్, డీజిల్ బంకులున్నాయి. వాటిల్లో కనీస వసతి సౌకర్యాలు లేక వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పైన పేర్కొన్న సౌకర్యాల గురించి ఒక్కటి కూడా వినియోగంలోకి రావడం లేదు. ఏళ్ల తరబడి ఈ సమస్యలు ఉత్పన్నమౌతున్నా, రెవెన్యూ, సివిల్ సప్లై, తూనికలు, కొలతలు అధికారుల పర్యవేక్షణ లేదని ఆరోపణలొస్తున్నాయి. ఇకనైనా అధికారులు పర్యవేక్షించి, వసతులు కల్పించాలి.

సౌకర్యాలు కల్పించాలి..



పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి, ఎక్కడ పెట్రోల్ బంకుల్లోకి వెళ్లినా గాలి మిషన్ పని చేయడం లేదని చెప్తున్నారే తప్ప మళ్లీ దానిని రిపేరు చేయించడం లేదు. పలుచోట్ల పనిచేస్తున్నా గాలి నింపడం లేదు. ఫిర్యాదుల పెట్టె కూడా కనిపించకుండా చేస్తున్నారు.

– ఏలూరి ఉదయ్‌కుమార్, పమ్మి

పరిశీలిస్తాం..



ఇంతవరకు నేను పరిశీలించలేదు. ఆర్‌ఐలతో మాట్లాడి అన్ని పెట్రోల్ బంక్‌ల్లో తనిఖీలు నిర్వహిస్తాం. సౌకర్యాలు లేని పెట్రోలు బంక్‌లపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివేదిస్తాం. చర్యలు చేపడతాం. సామన్య ప్రజలకు కల్పించాల్సిన కనీస వసతులు లేకపోతే ఉపేక్షించం.

– సునీత ఎల్జిబెత్, తహసీల్దార్, ముదిగొండ

రోడ్డు వెడల్పు తగ్గిస్తే సహించేది లేదు



మున్సిపల్ డీఈ శ్రీనివాసరెడ్డితో మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

వైరా: వైరా రిజర్వాయర్ రోడ్డు ముందుగా చెప్పిన ప్రకారం 60 అడుగులుగానే నిర్మించాలని, తగ్గిస్తే సహించేది లేదని అఖిలపక్ష నాయకులు శుక్రవారం నిర్మాణ పనులు అడ్డుకున్నారు. వైరా రింగ్‌రోడ్డు నుంచి రిజర్వాయర్ వరకు రూ.కోటి సూడా నిధులు మంజూరుకాగా.. అధికారులు 60 అడుగులు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలని తీర్మాణించారు. ఈ క్రమంలో కొంతమంది దుకాణదారులు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. నిధులు వెనక్కిపోయే అవకాశం ఉన్నందున అధికారులు తిరిగి 30 అడుగులకు కుదించి రోడ్డు పనులను చేస్తుండగా అకిలపక్ష నాయకులు అడ్డుకున్నారు. ఇదివరకు అనుకున్నట్లుగానే రోడ్డు పనులు అరవై అడుగుల వెడల్పుతో వేయాలని, లేకపోతే పనులు నిలిపివేయాలన్నారు. మున్సిపల్ డీఈ నరేష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని నాయకులతో మాట్లాడారు. ప్రతిపాదనలో ఇచ్చిన ప్రకారమే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలుపాగా.. నాయకులు భవిష్యత్ అవసరాల దృష్ట్యా రోడ్డు నిర్మాణపనులు చేపట్టాలని కోరగా.. రెండురోజులు పాటు పనులు నిలిపివేస్తున్నట్లు డీఈ ప్రకటించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, చెరుకూరి చలపతిరావు, సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, యామాల గోపాలరావు, పొరుపల్లి కృష్ణారావు, బొంతు సమత, శ్రీనివాసరావు, వెంకటకృష్ణారావు, మోహనరావు, సుధాకర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు సవరించాలి



బోనకల్: మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

బోనకల్/సత్తుపల్లిరూరల్: విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను ప్రభుత్వం సవరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ, సత్తుపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెరుకు శ్రీనివాసరావు, కొక్కెరగడ్డ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం బోనకల్, సత్తుపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలను ఈ సర్దుబాటు ప్రక్రియ తీవ్రంగా దెబ్బతీస్తుందని, సంఘాలతో చర్చించి ఆమోద యోగ్యమైన సర్దుబాటు ఉత్తర్వులు వెలువరించాలని కోరారు. నర్సరీ నుంచి కేజీ తరగతులను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు చిన్న రంగారావు, గోపాల్‌రావు, సౌభాగ్యలక్ష్మి, నరసింహారావు, సద్దాబాబు, కోటయ్య, సురేష్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సహజం

ఎర్రుపాలెం: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని ఏపీ రాష్ట్రం తిరువూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్‌ఆర్ సీపీ నేత నల్లగట్ల స్వామిదాస్ అన్నారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో సబార్డినేట్ తుపాకుల నాగేశ్వరరావు పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిదాస్, సుధారణి దంపతులు పాల్గొని నాగేశ్వరరావు దంపతులను సన్మానించారు. అదే విధంగా పలువురు అధికారులు, నాయకులు పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఈఓ శ్రీలక్ష్మి, మాజీ చైర్మన్ రామకృష్ణ, మాజీ ఎంపీపీలు అరుణ, శిరీష, మాజీ జెడ్పీటీసీ కవిత, కాంగ్రెస్, టీడీపీ, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 3 నుంచి రెవెన్యూ సదస్సులు

కారేపల్లి/ముదిగొండ: జూన్ 3వ తేదీ నుంచి 18 వరకు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు సింగరేణి తహసీల్దార్ సంపత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు, మధ్యాహ్నం 2గంటలకు ఆయా గ్రామ పంచాయతీల్లో సదస్సులు నిర్వహిస్తారని, భూ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా ముదిగొండ మండలంలో జూన్ 3నుంచి 17వరకు.. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ అన్నారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

ఎర్రుపాలెం: నాగపూర్ టూ అమరావతి గ్రీన్ ఫీల్డు హైవే రహదారి వెంబడి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి, అండర్ పాస్ నిర్మించాలని ఎర్రుపాలెం రైతులు కోరారు. శుక్రవారం జమలాపురం లింక్ రోడ్ సమీపంలోని పంట పొలాలు కలిగిన పలువురు రైతులు.. జాతీయ రహదారి నిర్మాణ పని ప్రదేశంలో ధర్నా చేసి గ్రావెల్ వాహనాలను అడ్డుకున్నారు. సమస్య తీవ్రతను అధికారులకు, కాంట్రాక్టర్ సిబ్బందికి వివరించగా.. వారు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం తహసీల్దార్ ఉషాశారదకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్ మస్తాన్ వలీ, రైతులు మౌలానా, రామారావు, దానయ్య, కృష్ణయ్య, పుల్లారావు తదితరులున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

వైరా: కావేరి విత్తన కంపెనీ యాజమాన్యం, ఏజెంట్లు, ఆర్గనైజర్లపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం వైరాలో నిర్వహించిన మొక్కజొన్న బాధిత రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కంపెనీ నేరుగా రైతుల ఎకౌంట్లోకి నగదు బదిలీ చేయకుండా ఏజెంట్‌కు బదిలీ చేయడంతో ఏజెంట్ డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నాడన్నారు. అధికారులు స్పందించి పంటను అమ్మిన రైతులకు నగదు ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

బడిలో చేర్పించండి

ఏన్కూరు/ఎర్రుపాలెం: తల్లిదండ్రులు తమ పిల్లలను సమీ పంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించాలని సహాయ గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి షేక్ జహీరుద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మూలపోచారం గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అదే విధంగా ఎర్రుపాలెంలోని వెంకటాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్‌ఎం వెల్లంకి నాగరాజు మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలను బడిలోకి చేర్పించాలని కోరారు. గ్రామంలో ఉపాధ్యాయులు స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌రెడ్డి విద్యార్థుల నోట్ పుస్తకాల నిమిత్తం రూ.10వేల నగదు వితరణ చేశారు.

కల్తీ విత్తనాలను అరికట్టాలి

మధిర: వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో కల్తీ విత్తనాల బెడదను నివారించుటకు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందించారు. బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీహరి చౌదరి పాల్గొన్నారు.

బీజేపీ మండల నూతన కమిటీ ఎన్నిక

చింతకాని: బీజేపీ మండల అధ్యక్షుడిగా కొండా గోపి, ప్రధాన కార్యదర్శిగా గోదా మంగయ్యను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆ పార్టీ సమావేశంలో వీరితో పాటు ఉపాధ్యక్షులుగా పగడాల విష్ణుప్, చింతాల కృష్ణా, బక్కా సత్యమూర్తి, కొండా వెంకన్న, కార్యదర్శులుగా పర్సగాని ఎల్లయ్య, మెట్టెల హేమంత్, శ్రీను, నారపోగు శ్రీనివాసరావు, కోశాధికారిగా గోదా ప్రసాద్‌లతో పాటు 22 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హెల్మెట్లు పంపిణీ

వైరారూరల్: మండలంలోని తాటిపూడి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుమారుడి జ్ఞాపకార్థం తండ్రి నాగేశ్వరరావు యువకులకు 100 హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భట్టా పెద్ద భద్రయ్య, బండి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ప్రశాంతి

ఎర్రుపాలెం: యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని మధిర సీనియర్ సివిల్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.ప్రశాంతి అన్నారు. శుక్రవారం జమలాపురంలోని డీవైఎఫ్ఐ సంఘం ఆధ్వర్యంలో పంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. తొలుత డీవైఎఫ్ఐ చేపట్టిన సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, బషీరుద్దీన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, ఎస్సై రమేష్, వైద్యాధికారి ప్రశాంత్, మధిర బార్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ శ్రీనివాసరావు, న్యాయవాదులు, విశ్రాంతి ఉద్యోగుల కార్యదర్శి నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు, యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీలుగు విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి



వైరారూరల్: గరికపాడులో జీలుగులు అందిస్తున్న సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి

ఎర్రుపాలెం/బోనకల్/వైరారూరల్: పంట పొలాల్లో పోషకాలు పెంచేందుకు సాగు చేసే పచ్చిరొట్ట విత్తనాలను (జీలుగు విత్తనాలు) రైతులు సద్వినియోగం చేసుకోవాలని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఏఓ వినయ్‌కుమార్, కారేపల్లి సొసైటీ చైర్మన్ అయిలూరి కృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు, పెద్దగోపవరం, అయ్యవారిగూడెం సొసైటీలతో పాటుగా.. బోనకల్‌లోని మోటమర్రి సహకారసంఘం, వైరాలోని గరికపాడు సొసైటీలో సబ్సిడీతో మంజూరైన జీలుగు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు సైదులు నాగసాయి, సొసైటీ చైర్మన్లు బోజెడ్ల పుల్లారావు, మధుసూదన్‌రెడ్డి, అక్కిరెడ్డి, సాంబశివరావు, సీఈఓ కృష్ణారావు, సీఈఐ రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి



మధిర: తనిఖీ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

మధిర: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మధిర టౌన్ సీఐ రమేష్, మండల వ్యవసాయాధికారి కె.సాయిదీక్షిత్ సూచించారు. శుక్రవారం వారు మధిరరూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీభార్గవితో కలిసి విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్‌లు, విత్తన స్టాక్‌ను పరిశీలించారు. కొనుగోలు సమయంలో బిల్లు తీసుకోవాలని, దానిపై డీలర్, రైతు సంతకాలు ఉండాలన్నారు.

బోనకల్: మండలంలోని వివిధ విత్తన దుకాణాలను మధిర ఏడీఏ స్వర్ణవిజయ్‌చంద్ర, మండల వ్యవసాయ అధికారి పసునూరి వినయ్‌కుమార్, ఎస్సై పొదిలి వెంకన్నతో కలసి శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు విక్రయించే వారి సమాచారాన్ని వ్యవసాయ అధికారులకు తెలియజేయాలన్నారు.

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో విత్తన దుకాణాలను ఏఓ మానస, ఎస్సై నాగుల్ మీరా శుక్రవారం తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు.

కారేపల్లి: కారేపల్లిలోని వివిధ విత్తన దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి బట్టు అశోక్‌కుమార్, కారేపల్లి ఎస్సై ఎన్.రాజారాం, మరికొంత మంది అధికారులతో ఏర్పడిన టాస్క్‌ఫోర్స్ టీం శుక్రవారం తనిఖీలు చేపట్టారు.

ఇందిరమ్మ పథకంతో మేలు

సత్తుపల్లిటౌన్: ఇందిరమ్మ గృహ పథకంలో మేలు జరగనున్నందున లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో 212మందికి మంజూరు పత్రాలు అందించామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు ఇంటి పనులు చేపట్టిన తర్వాత బెస్మెంట్ స్థాయి నుంచి నాలుగు విడతల్లో బ్యాంక్ ఖాతాల్లోనే రూ.5లక్షలు జమ చేయబడతాయన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ మైసా శ్రీనివాసరావు, గృహ నిర్మాణశాఖ ఏఈ పవన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లక్ష మందికి కంటి పరీక్షలు చేయించడమే లక్ష్యం

కల్లూరు: లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా లక్షమందికి కంటి చూపు, లక్ష మందికి షుగర్ స్క్రీనింగ్ పరీక్షలు, 3 లక్షల మందికి ఆహారం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు రేపాల మదన్ మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరులో డిప్యూటీ గవర్నర్ చలువాది నగేష్ అధ్యక్షతన నిర్వహించిన ×పీఎస్‌టీ మరియు గేట్ స్కూలింగ్ వర్క్ షాపు×కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కల్లూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు నరసింహారావు, రమేష్, ఆనందరావు, సురేష్, మొరళీధర్‌రావు, సత్యనారాయణ, భాస్కర్‌రావు, శ్రీనివాసరావు, అప్పలనాయుడు, ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన తూము దుర్గాభవాని ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో.. సుమన్ టీవీ వారు శుక్రవారం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. విద్యార్థి ఖమ్మంరూరల్ మండలం మహాత్మాజ్యోతీబాపూలే గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించింది. పది ఫలితాల్లో 600/593 మార్కులు సాధించడంతో సుమన్‌టీవీ వారు నగదు అందించి అభినందించారు. కార్యక్రమంలో సుమన్ టీవీ బృందం, జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ రామారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

సత్తుపల్లిటౌన్: పది పరీక్ష ఫలితాల్లో డివిజన్ స్థాయిలో ఫస్ట్‌ర్యాంక్ సాధించిన స్థానిక టాలెంట్ స్కూల్ విద్యార్థులు సహస్ర, తన్మయి, శ్రీజా, సాయితేజశ్విని, పర్వీన్, ధనుష్‌కుమార్‌లకు సత్తుపల్లి రిలయన్స్ ట్రెన్స్ ఆధ్వర్యాన శుక్రవారం ప్రశంసాపత్రాలు, గోల్డ్‌మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కిరణ్‌కుమార్, పాషా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్లపై యమ పాశాలు

ఇళ్లపై నుంచి పోతున్న 33 కేవీ వైర్లు

- నిలిచిన ఇందిరమ్మ నిర్మాణాలు
- ఆందోళనలో లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఇంటిపై ఉన్న విద్యుత్ వైర్లను చూపుతున్న మహిళ



చిన్నగోపతిలో ఇళ్లపై నుంచి పోతున్న విద్యుత్ తీగలు

కొణిజర్ల: మండలంలోని చిన్నగోపతిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు విద్యుత్ తీగలు అడ్డంకిగా మారాయి. గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే గ్రామానికి చెందిన దొంతిసర్ప నాగేశ్వరరావుకు కొత్తగా ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఉత్సాహంగా ఇంటి నిర్మాణం మొదలు పెట్టాడు. తీరా స్లాబ్ లెవల్‌కు వచ్చేటప్పటికి 33 కేవీ వైర్లు అడ్డంగా మారాయి. దీనికి ప్రధాన కారణం తీగలు సరిగ్గా ఇంటిపై నుంచే పోతుండటంతో పాటు తక్కువ ఎత్తులో ఉండడంతో మేస్త్రీలు పనిఆపేశారు. తీగలు తొలగిస్తేనే పనులు మొదలు పెడతామన్నారు.


ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

నాగేశ్వరరావుతోపాటు పగడాల చంద్రిక, రామారావు, బండారు శ్రీనివాసరావు, అప్పారావు, పంది నాగేశ్వరరావు, మారగాని వెంకటేశ్వర్లు, జట్ల వెంకన్న, బండారు ఆదినారాయణ తదితరుల ఇళ్లపై నుంచి తీగలు పోతున్నాయి. దీంతో వారంతా ఇటీవల గ్రామంలో పర్యటనకు వచ్చిన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి తెసుకెళ్లగా.. ఆయన ఇళ్లను పరిశీలించి స్తంబాలు మార్చేందుకు ఎస్టిమేట్ వేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు.

ఆవేదనలో నిరుపేదలు..

అధికారులు సర్వే చేసి రూ. 2.50 లక్షలు ఖర్చు అవుతుందని, ఆ సొమ్మును ఇంటి యజమానులు భరిస్తే.. లైను మారుస్తామని తెలిపారు. దీంతొ రెక్కడితే గానీ డొక్కాడని నిరుపేదలు అంత డబ్బు ఎలా కట్టాలని ఆవేదన వక్తం చేస్తున్నారు. 100 నుంచి 150 మీటర్లు దూరం కలిగి, మూడు స్తంభాల పరిధిలో ఉన్న ఈ వైర్లు తొలగించి స్తంభాలను రోడ్డు పక్కకు జరిపి కొత్త లైన్ వేస్తే ఎటువంటి అపాయాలు జరగవని, సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటి నిర్మాణం ఆగిపోయింది..



ఇంటి నిర్మాణం మొదలు పెట్టుకున్నా. ఇంటి మీద నుంచే కరెంట్ తీగలు పోతున్నాయి. గోడలకు నీళ్లు కొట్టాలంటే భయంగా ఉంటుంది. అధికారులకు చూపించాను. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పరిశీలించి లైన్ మార్పిస్తానని హామీ ఐతే ఇచ్చారు కానీ స్తంబాలు పక్కకు జరపలేదు. దీంతో ఇంటి నిర్మాణం నిలిచిపోయింది.

– దొంతిసర్ప నాగేశ్వరరావు, చిన్నగోపతి